విద్యుత్ కార్మికుల అరెస్టు దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హక్కుల సాధన కోసం శాంతి పోరాటం చేస్తున్న విద్యుత్ కార్మికులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే విద్యుత్ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా పాల్పడడం ప్రభుత్వ నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందని అన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కార్మికులను రెగ్యులర్ చేస్తామని మాయమాటలు చెప్పి అధికారం చేపట్టాక మాట తప్పడం కూటమికి సమంజసం కాదన్నారు. విద్యుత్ సంస్థలో ఖాళీలు భర్తీ చేసి కార్మికులకు పని భారం తగ్గించాలని పేర్కొన్నారు. పలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వివిధ రూపాలలో ఆందోళనలు చేపట్టినప్పటికీ యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ స్పందించకపోవడంతో చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెడితే విజయవాడకు చేరుకోకుండానే కార్మికులను ఎక్కడికక్కడ అణచివేసి బలవంతంగా పోలీస్ పోలీస్టేషన్‌లో ఉంచడం దారుణమైన చర్య అన్నారు. వెంటనే విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దుర్భరం.. గిరిజనుల జీవనం

- అభివృద్ధికి ఆమడదూరం..
- వసతుల లేమితో సతమతం
- పూరి గుడిసెలే వారి ఆవాసాలు
- ఆధార్, రేషన్ కార్డుల్లేక సంక్షేమ పథకాలు దూరం
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని అధికారులు
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

దేశంలో మారుమూల పల్లెల్లో నివసించే గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయి. ఫలితంగా వారి అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా మారుమూల పల్లెల్లో నివసించే గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు. 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజనులు ఉన్నారు. గిరిజనుల్లో ఒక తెగగా చెప్పుకునే యానాదులు ఏ ఒక్క ప్రభుత్వ పథకాలు అందుకోలేని అనాథలుగా మిగిలిపోవడం శోచనీయం. గుట్ట, పుట్ట పట్టుకుని పూట గడుపుతున్న యానాదుల దీనగాధ అంతా ఇంతా కాదు. జిల్లాలో 75 యానాదులు కాలనీలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా కూడా ఉన్నారు. ఆధార్ లేక కొందరు, రేషన్ లేక మరి కొందరు, ఒకవేళ రైతన్న ఆధార్ ఉన్నా ఇకెవైసి, ఫోన్ నెంబర్ లింక్ వసతులు లేక, ప్రభుత్వ పథకాలు పక్కా గృహాలు, వృద్ధాప్య పింఛను, తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి ప్రభుత్వ పథకాలకు వారు దూరమవుతున్నారు. కనీసం అధికారులు వ్యవస్థ ఏర్పాటైనాకైనా వారికి ప్రభుత్వ పథకాలు చేరడం లేదు. యానాదుల పిల్లలకు ఆధారు కార్డు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకొని, వారిని పాఠశాలల్లో చేర్పించే సామాజిక బాధ్యత లేని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటు ఉన్నాయి. జిల్లాలో అధికారులు నిర్లక్ష్యం ఎక్కువగా కనబడుతోంది.

ప్రజాశక్తి-రాయచోటి

చిట్వేలి మండలంలోని రాజారెడ్డి యానాది కాలనీ

జిల్లాలోని రైల్వే కోడూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లి, రాయచోటి, గాలివీడు, రామాపురం మండలాల్లో యానాదుల కాలనీలు ఉన్నాయి. వారిని అభివృద్ధి చేసేందుకు నెల్లూరు జిల్లాలో ఐటిడిఎ ఆఫీసు ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న ప్రాజెక్టు అధికారి ఇంత వరకూ యానాది కాలనీలవైపు కన్నెత్తి కూడా చూడక పోవడం శోచనీయం. కనీస యానాదులు సమస్యలు పరిష్కరించడానికి మొగ్గు చూపడం లేదు. యానాదులు వెనుక బడిబాట కారణం ఐటిడిఎ అధికారులే ఇప్పటికైనా స్పందించి యానాదులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా ఉన్నతాదికారులు ధర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలువురు యానాదులు కోరుతున్నారు. ఆధార్ కార్డుల కోసం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నివేదికలు పంపినా నెల్లూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చీమ కుటినట్లు కూడా లేదని పలువురు యానాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాదులు కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని యానాది సంక్షేమ సంఘం వినతి పత్రం సమర్పించినా ప్రాజెక్టు అధికారి ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని యానాది నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డు లేక తమ పిల్లలను స్కూళ్లల్లో కూడా చేర్పించలేని. పరిస్థితి నెలకొందనీ దీనివలన పిల్లలకు రావాల్సిన పథకాలు కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇటీవల కాలంలో యానాధలకు రిజర్వేషన్ కల్పించాలని కడప, రాజంపేట ప్రాంతాలలో నిరసన, ర్యాలీ కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇప్పటికైనా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని జిల్లాలోని యానాదులు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

రాజంపేట రైల్వేకోడూర్ నియోజకవర్గాలలో అత్యధికంగా యానాదులకు ప్రత్యేక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఏ కార్యాలను వెళ్ళినా కూడా ఆధార్ కార్డు తప్పనిసరని అధికారులు చెబుతున్నారు. ఆధార్ సెంటర్లో ఎక్కడున్నాయో తెలియక చాలామంది యనాధలకు ఆధార్ కార్డులు లేవు. ఒకవేళ ఆధార్ కార్డు ఉన్నా కూడా మళ్లీ ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ చేయమని చెబుతున్నారు.

అవి ఎక్కడ చేస్తారో తెలియదు. ప్రభుత్వం నుంచి వచ్చే వృద్ధాప్య పింఛన్లు, తల్లికి వందనం, పక్కా గృహాలు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు రావడం లేదు. అధికారుల స్పందించి గిరిజన యానాదాలు ఉండే ప్రాంతాలలో ఆధార్, రేషన్, ఫోన్ నెంబర్ లింక్ ఇతర మౌలిక వసతులు కల్పించాలి.

- నీలం అంకమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి, యానాదుల సంక్షేమ సంఘం .

ఎస్‌టి వర్గీకరణ అమలు చేయాలి

ఎస్‌టి వర్గీకరణతోనే యానాదులకు న్యాయం జరుగుతుంది. రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది యానాదులు ఉన్నారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో అత్యధిక జనాభాగా ఉన్న యానాదులు నేటికీ అన్ని రంగాలలో వెనకబడి ఉన్నారు. యానాదుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. ఎస్‌సి వర్గీకరణ మాదిరిగా ఎస్‌టి వర్గీకరణ కూడా చేసి యానాదులకు అందవలసిన ప్రభుత్వ ఫలాలు వారికే అందేలా చూడాలి.

- పులి శివశంకర్, జిల్లా అధ్యక్షులు, యానాదుల సంక్షేమ సంఘం.

ఆందోళన అవసరం లేదు

జిల్లాలోని ప్రతి సచివాలయం, మండల ఎంపిడిఒ కార్యాలయాలలో ఆధార్ లాగిన్ ఓపెన్ అవుతుంది. ఎవరైనా విద్యార్థులు ఆధార్, రేషన్ కార్డ్ లేని వారు అక్కడికి వెళ్లి పరిశీలించుకోవచ్చు. లేనివారికి ఆధార్ కార్డు రేషన్ కార్డు అక్కడే వారు అందజేస్తారు. తమ కార్యాలయంకు ఎవరైనా వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారికి కావలసిన ఆధార్, రేషన్ కార్డును ఏర్పాటు చేస్తాం.

- పి.తేజస్విని, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి.

తప్పు చేసిన వారికి శిక్ష పడాలి

- మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత

సునీతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డిని చిన్నపిల్లాడిగా చూశామని, అతనే వై.ఎస్. వివేకానందరెడ్డి హత్యకు కారణమవుతాడని ఊహించలేదని, సాక్షులను లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తప్పు చేసిన వారికి శిక్ష పడాలని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె వైఎస్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం తన తండ్రి వివేకా 74వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన సమాధికి తన భర్త రాజశేఖరరెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివేకానందరెడ్డి పార్కు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివేకా హత్యకు కారణం ఆదినారాయణరెడ్డి, సతీష్‌రెడ్డి, బిటెక్ రవి అని ఒక లేఖ రాసుకొని తీసుకువచ్చి సంతకం పెట్టమని వై.ఎస్.అవినాష్ అడిగారు అన్నారు. పోలీసుల సమక్షంలోనే రక్తపు మడుగులను తుడచడం, గాయాలకు కట్టు కట్టడం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిట్ అధికారులను మార్చారని చెప్పారు. న్యాయస్థానం చొరవతో కేసును సిబిఐకి అప్పగించడం జరిగిందని ఆమె తెలిపారు. సిబిఐ అధికారులు విచారణ చేయకుండా అడ్డుకొని వారిపై కేసులు కూడా పెట్టారని చెప్పారు. కర్నూలులో అవినాష్‌ను సిబిఐ అరెస్టు చేసే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు చాలా బాధాకరమన్నారు. ఇవన్నీ గత ప్రభుత్వంలో చేసి ఇప్పుడు పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వివరిస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

సునీతతో ఆదినారాయణరెడ్డి భేటీ

మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి కుమార్తె వై.ఎస్.సునీతతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం జడ్‌పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా పులివెందులకు ప్రచార నిమిత్తం వచ్చిన ఆదినారాయణరెడ్డి వై.ఎస్.వివేకానందరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వై.ఎస్.సునీత ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, తల్లి సౌభాగ్యమ్మతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం మద్దతు ఇవ్వాలని కోరినట్టు తెలుస్తుంది. అలాగే వివేకా హత్య కేసుకు సంబంధించి చర్చకు వచ్చినట్టు సమాచారం. వై.ఎస్. సునీత చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో నడుస్తున్నారని వైసిపి నాయకులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఉప ఎన్నికల నేపథ్యం, వివేకా హత్య కేసు న్యాయస్థానంలో విచారణ చివరి దశలో ఉన్న సమయంలో వీరిద్దరి భేటీ చర్చనీయాంశమైంది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఉప ఎన్నికలు

- కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలో పోలీసులను అడ్డు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసులను అసభ్యంగా సతీష్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి మాట్లాడి భయ భ్రాంతులకు చేస్తున్నారని పేర్కొన్నారు. 2019లో, 2024లో జగన్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో గమనించాలన్నారు. రెవెన్యూ, పోలీసులను బెదిరిస్తు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది వైసిపినే అన్నారు. సునీతను కూడా చంపుతారేమో అని పులివెందులకు రావద్దని తల్లి సౌభాగ్యమ్మ చెప్పారంటే అంతకన్నా దారుణం ఏముంది అన్నారు. గతంలో తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. పింఛన్లు, సంక్షేమ పథకాలు టిడిపి కార్యకర్తలకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి అవినాష్‌రెడ్డి మాట్లాడడం దయ్యాలు వేదాలు వర్ణించినట్టుగా ఉందని ఎద్దేవ చేశారు. వైసిపి అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. 40 ఏళ్లుగా అధికారంలో ఉండిమంచి నీళ్లు కూడా ప్రజలకి ఇవ్వలేని పరిస్థితి అన్నారు. ప్రజల అమాయకులు కాదని చంద్రబాబు నాయుడు చేసే అభివృద్ధిని చూసి ఓటు వేస్తారన్నారు. ఓటమి భయంతోనే వైసిపి నాయకులు అలా మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, టిడిపి నాయకులు లింగారెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు : ప్రభుత్వ విప్ 'ఆది'

ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసిపి నాయకులు టిడిపి వారిపై దాడులకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోని వై.ఎస్.వివేకానందరెడ్డి నివాసంలో ఆదినారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా వివేక కుమార్తె డాక్టర్ సునీతను కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వివేకానందరెడ్డి హత్య కేసును ముందుగా తమపై మోపారని అది అసత్యమని తేలిందని పేర్కొన్నారు. కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున దగ్గరుండి రక్తపు మరకలను తుడిపించారని తెలిపారు. ఇది పులివెందుల ప్రాంత ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్‌జగన్ మోహన్ రెడ్డికి ఈ విషయం తెలిసి కూడా హత్య జరిగిన రోజు ఆలస్యంగా పులివెందులకు వచ్చారని చెప్పారు. కోడి కత్తి డ్రామాతో పాటు వైసిపి ఎన్నికలలో ప్రతిదీ కట్టుకథలు ప్రజలు మధ్య పెట్టేందుకు అల్లుతూ ఉంటారని పేర్కొన్నారు. వాస్తవాలను కప్పిపెట్టి అసత్య ప్రచారాలను చేస్తూ ఎన్నికలలో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తుంటారని పేర్కొన్నారు. వివేకా హత్య కేసుకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షాపుతో కూడా మాట్లాడమని దీనికి సంబంధించి తప్పకుండా న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఉన్నామని చెప్పారు. జగన్ బటన్ నొక్కడం తప్ప ఇంకేమీ రాదని తెలిపారు. పులివెందుల ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది వైసిపి కాదని కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని రాబోయే రోజుల్లో అమలు చేస్తుందని పేర్కొన్నారు

మాట్లాడుతున్న మంత్రి సవిత

భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డికి నోటీసులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : టిడిపి నాయకుడు విశ్వనాథరెడ్డిని ఇటీవల ఫోన్‌లో బెదిరించిన కేసులో వై.ఎస్.భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి పులివెందుల పోలీసులు 41-ఎ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాద్ వెళ్లి ఇద్దరికీ నోటీసులు అందజేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో వీరిద్దరూ నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి టిడిపిలో చేరారు. భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు బెదిరించినట్లు విశ్వనాథరెడ్డి ఫిర్యాదు చేశారు. వీరందరిపైనా పోలీసులు ఈనెల 5న కేసు నమోదు చేశారు. అయితే, వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండాలని కండిషన్ బెయిల్ ఉన్నందువల్ల పులివెందుల పోలీసులు అక్కడికి వెళ్లి 41-ఎ నోటీసులు అందజేశారు.

గాలిబండ వద్ద ఏర్పాటు చేసిన కంచె

హార్సిలీహిల్స్ గాలిబండ వద్ద కంచె ఏర్పాటు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ కొండమీద మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర సహకారంతో గాలిబండ వద్ద కంచె ఏర్పాటు చేసినట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. మోటార్ సైకిళ్లు, కార్లు తదితర వాహనాలు గాలిబండ వద్దకు వెళ్లకుండా నియంత్రణ చేయవచ్చునన్నారు. గాలిబండ వైపు ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పర్యాటకులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కంచెను ఏర్పాటు చేశామన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేసిన హాకీ జట్లతో కోచ్‌లు

జోనల్ స్థాయి పోటీలకు హాకీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

త్వరలో తిరుపతిలో నిర్వహించబోయే జోనల్ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుండి జట్లను ఎంపిక చేసినట్లు అన్నమయ్య జిల్లా హాకీ సెక్రెటరీ నాగేశ్వరరావు, తెలిపారు. క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని పురస్కరించుకొని శుక్రవారం రాజు స్కూల్ మైదానంలో జిల్లా స్థాయి హాకీ పోటీలను నిర్వహించారు. మెరుగైన ప్రతిభను ప్రదర్శించిన బాల, బాలికల జట్లను వేర్వేరుగా ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు త్వరలో తిరుపతిలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పోటీలను జిల్లా హాకీ ఫౌండర్ సి. చంద్రశేఖర్, షాప్ కోచ్ చంద్రశేఖర్, రాజు స్కూల్ హాకీ కోచ్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కిడ్నాప్ చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సచివాలయం ఉద్యోగిని కిడ్నాప్ చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం, శరబవరం సచివాలయంలో పనిచేసే ఉద్యోగి సౌమ్యను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారన్నారు. కిడ్నాప్ సమయంలో సహచర ఉద్యోగులు, స్థానికులు అడ్డుపడినా వారిని కూడా కత్తులతో బెదిరించి పారిపోయారన్నారు. విధి నిర్వహణలో ఉన్న సౌమ్యను కార్యాలయంలోకి పట్టపగలే కిడ్నాప్ చేస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇలా అయితే ఉద్యోగులు తమ విధులను ఎలా చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులందరూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని తెలిపారు.

పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కార్యదర్శిగా దేవేంద్రారెడ్డి

ప్రజాశక్తి-కంభంవారిపల్లి



వైసిపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కార్యదర్శిగా మండలంలోని నూతన కాలువ గ్రామానికి చెందిన కుప్పం దేవేంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో ఈ పదవి వచ్చిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన బాధ్యతలు తన శక్తి మేర నిర్వహించి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తాను పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నానన్నారు. పదవులు ఎన్నడూ ఆశించలేదని తన మీద ఉన్న నమ్మకంతో ఈ పదవిని అప్పగించారని చెప్పారు.

వాహనాల స్టాండ్‌గా షాదీఖానా

- ఏళ్ల తరబడి నిరుపయోగం
- నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకున్న వైనం
- పెళ్లిళ్లు, శుభకార్యాలకు తడిసి మోపెడవుతున్న ఖర్చు

జిల్లా కేంద్రం నడిబొడ్డున నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్న షాదీఖానా భవనం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల మైనార్టీల సౌకర్యార్థం ప్రభుత్వం రెండు దశాబ్దాల కిందట నగరం నడిబొడ్డున నిర్మించిన షాహి షాదీఖానా నిరుపయోగంగా మారింది. నిర్వహణ లోపం, అధికారుల అలసత్వంలతోనే భవనం పూర్తిస్థాయిలో దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుందన్న బలమైన ఆరోపణలున్నాయి. ఒకవైపు ప్రభుత్వ ఆదాయానికి ఎంతో కొంత గండిపడుతూనే, మరో వైపు పెళ్లిల్లు, శుభకార్యాల నిర్వహణకు ముస్లిం, మైనార్టీలపై లక్షల్లో ఆదనపు భారం పడుతోంది. జాతీయ రహదారి ప్రక్కనే కోట్లాది రూపాయల విలువతో నిర్మించిన భవనం ప్రాంగణం పట్టణంలోని వాహనాలకు స్టాండుగా మారింది.

రాయచోటి ప్రాంతంలో ముస్లిం, మైనార్టీల సంఖ్య ఎక్కువ. బీడీకార్మికులు, లారీ లారీకార్మికులు, తోపుడు బండ్ల వ్యాపారులు, చిరువ్యాపారులుగా జీవించే ముస్లిం ప్రజల సౌకర్యార్థం 2004లో అప్పటి ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు, మైనార్టీ నేత బేపారి బషీర్‌ఖాన్‌ల కృషి ఫలితంగా టిడిపి ప్రభుత్వం జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న ఫైర్‌స్టేషన్ స్థలంలో షాదీఖానాను నిర్మించారు. అందరికి అనువైన స్థలం, కోట్లాది రూపాయల విలువచేసే స్థలంలో షాదీఖానా నిర్మించడంలో మైనార్టీలకు ఎంతో ప్రయోజకరంగా ఉండేది. ప్రభుత్వాలు మారవడంతో షాదీఖానా అభివృద్ధిపై ప్రాధాన్యతాంశాలు మారాయి. షాదీఖానాలో పేద ముస్లిం, మైనార్టీలు తమ కుటుంబీకుల శుభకార్యాలను రూ.2 వేలు ప్రభుత్వానికి చెల్లించి షాదీఖానాలో చేసుకునేవారు. కాలక్రమేణా భవనం నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో పనైకప్పుతో పాటు కిటికీలు తదితరాలు దెబ్బతిని వర్షానికి ఉరవడం మొదలైంది. భవనంలో శుభకార్యాలు జరిగే పరిస్థితి లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. భవనం వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకపోవడంతో మైనార్టీలు, ప్రయివేట్ కల్యాణ మండపాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి పెళ్లిల్లు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. నిరుపేద కుటుంబాల శుభకార్యాల నిర్వహణ తీరని భారంగా మారుతోంది. 2023లో షాదీఖానాను తిరిగి మైనార్టీలకు అందుబాటులోకి తెచ్చేందుకు అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మైనార్టీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్‌లు ఎంతో కృషి చేశారు. భవనం మరమ్మతుల కోసం శ్రీకాంత్‌రెడ్డి సూచనల మేరకు బేపారి మహమ్మద్ ఖాన్ సుమారు రూ.15 లక్షలు స్వంతంగా వెచ్చించి చిన్నచిన్న మరమ్మతులు చేయించినప్పటికీ ప్రభుత్వం మారడంతో పరిస్థితి యదాతథ స్థితికి చేరుకుంది. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చినప్పటికీ షాదీఖానా గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడనడంలో సందేహం లేదు. మైనార్టీల సంక్షేమమే, అభివృద్ధి తమ ధ్యేయంగా డబ్బాకొట్టుకునే టిడిపి నాయకులు షాదీఖానాను పున:ప్రారంభించే అంశంలో ఎందుకు మిన్నకుంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా భవనం నిరుపయోగంగా మారవడంతో ముందు బాగం వాహనాలు స్టాండుగా, యాచకులకు నిలయంగా తయారైంది. రాయచోటి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఏవైనా పెద్ద పెద్ద అధికారిక కార్యక్రమాల నిర్వహణకు కూడా అధికారులు ప్రయివేట్ కల్యాణ మండపాలను వినియోగించుకోవడం గమనార్హం. భవనం మరమ్మలు చేస్తే అధికారిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో అనువుగా ఉంటుందని పట్టణ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం ఎంతో ఉపయోగపడే షాదీఖానా భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి

షాదీఖానాకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేయించాలి. పట్టణం నడిబొడ్డున ఉన్న షాదీఖానా భవనం నిరుపయోగంగా మారడంతో వివాహాలు, శుభ కార్యాల నిర్వహణకు ముస్లిం సమాజంపై పెనుభారం పడుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి షాదీఖానాను పేదలకు అందుబాటులోకి తేవాలి.

- అక్బర్ అలీఖాన్, రాయచోటి.

మైనార్టీలకు ఎంతో ఉపయోగం

తక్కువ ఖర్చుతోనే వివాహాలు చేసుకునే వీలుండడంతో షాదీఖానా ముస్లిం,మైనార్టీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వం వెంటనే శిథిలాస్థకు చేరుకున్న భవనానికి పూర్తిస్థాయి మరమ్మతులు చేయించి మరిన్ని వసతులు కల్పిస్తే మైనార్టీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

- ఆఫ్తాబ్, రాయచోటి.

వెంటనే ఉపయోగంలోకి తేవాలి

శిథిలావస్థకు చేరిన షాదీఖానాను ప్రభుత్వం వెంటనే ఉపయోగంలోకి తేవాలి. షాదీఖానా పట్టణం నడిబొడ్డున అందరికి అందుబాటులోనూ, అనుకూలంగాను ఉంది. పూర్తిగా శిథిలమై, ప్రభుత్వ ధనం వృధాకాకమునుపే మరమ్మతులు చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు భవనానికి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేయాలి.

- అమీర్‌బాషా, మాసాపేట.

సమస్యల కేంద్రం..ఈ గ్రంథాలయం...!

- నామమాత్రంగా సాగుతున్న రాయచోటి గ్రంథాలయం
- ఇరుకు గదుల్లో కొనసాగుతున్న దుస్థితి
- అటకెక్కిన విలువైన పుస్తకాలు
- ఏళ్లతరబడి వెంటాడుతున్న ఉద్యోగుల కొరత
- దశాబ్దాలుగా అద్దెభవనాల్లోనే...

గ్రంథాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం

నలుగురు మాత్రమే కూర్చుని చదువగలిగే ఇరుకైన గది

మూటల రూపంలో గ్రంథాలు, పుస్తకాలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

దశాబ్దాలుగా రాయచోటి పట్టణంలోని గ్రంథాలయం నామమాత్రంగా సాగుతోంది. పట్టణంలోని ఓ ఇంట్లో ఇరుకిరుకు గదులలో కష్టతరంగా నిర్వహిస్తున్నారు. స్థలాభావం కారణంగా గ్రంథాలయానికి చెందిన ఎంతో విలువైన పుస్తకాలు అటకెక్కాయి. ఏళ్ల తరబడి ఉద్యోగుల కొరత వెంటాడుతోంది. సొంతభవనం లేని కారణంగా దశాబ్దాలుగా అద్దెభవనాలోనే కొనసాగుతుండడంతో గ్రంథాలయం ఎక్కడ ఉందో చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదేమో.

ఏడు దశాబ్దాల కాలంగా రాయచోటి పట్టణంలో గ్రంథాలయం అద్దెభవనాల్లోనే నిర్వహిస్తున్నారు. మొదట్లో బ్రహ్మణవీధి, తర్వాత బోస్‌నగర్, కొత్తపేట, ఎస్ఎన్ కాలనీలలోని అద్దెభవనాల్లో భారంగా నడుస్తోంది. మొదట్లో లైబ్రేరియన్, అటెండర్, వాచ్‌మెన్ తదితర ఉద్యోగులు పనిచేసేవారు. ఉన్న ఉద్యోగుల ఉద్యోగ రమణ తర్వాత కొత్త ఉద్యోగులను ప్రభుత్వం నియమించక పోవడంతో ప్రస్తుతం లైబ్రరీ ఒక్క లైబ్రేరియన్‌తోనే కొనసాగుతోంది. జిల్లా కేంద్రమైనప్పటికీ గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా రాయచోటి లైబ్రరీ గ్రేడ్-2 స్థాయిలోనే కొనసాగుతోంది. ఫలితంగా పాఠకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కాలక్రమేణా అద్దెలు పెరుగుతుండడం, అందుకు తగ్గవిధంగా ప్రభుత్వం అద్దెలు చెల్లించకపోతుండడంతో గ్రంథాలయం నిర్వహణకు అవసరమైన ఒక మోస్తరు భవనం కూడా దొరకడంలేదు. ప్రభుత్వం తూతూ మంత్రంగా అందించే రూ.6500 అద్దెతోనే చిన్నచిన్న భవనాల్లోనే నిర్వాహకులు లైబ్రరీని నిర్వహిస్తున్న దుస్థితి. లైబ్రరీ ఎక్కడ ఉందో చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఎస్ఎన్ కాలనీలోని ఒక చిన్న అద్దెభవనంలో లైబ్రరీ నడుపుతున్నారు. భవనంలో ఉన్న రెండు చిన్నచిన్న గదులలో నలుగురు కూడా కూర్చుని చదువలేని పరిస్థితి. స్థలాభావం కారణంగా గ్రంథాలయానికి చెందిన వేలాది పుస్తకాలు మూటలుగా కట్టి గదులలోని అటకలపైన ఉంచారు. ఫలితంగా ఎంతో విలువైన సమాచారాన్ని ఇచ్చే పుస్తకాలు ఉన్నప్పటికీ అవి మూటలరూపంలోకి మారవడంతో పాఠకులు వాటిని చదువలేని దుస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. లైబ్రరీ అందుబాటులో లేకపోవడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు, విద్యార్థులే సమాచారం కోసం సొంత ప్రయత్నాలు చేసుకోక తప్పడం లేదు. ప్రభుత్వం కొత్తగా ఉద్యోగుల నియామకం చేపట్టకపోతుండడంతో దశాబ్దాలుగా రాయచోటి లైబ్రరీని ఉద్యోగుల కొరత వెంటాడుతోంది. గ్రంథాలయాన్ని దివ్యాంగుల కోటాకింద లైబ్రరియన్‌గా ఎంపికైన వ్యక్తి నిర్వహిస్తున్నారు. అటెండర్, వాచ్‌మెన్‌లు లేకపోవడంతో లైబ్రరీ నిర్వహణకు ఆయన నానాతంటాలు పడాల్సి వస్తోంది. లైబ్రేరియన్‌కు కొద్దిరోజుల క్రితం సంబేపల్లెకు బదిలీవచ్చినప్పటికీ ఇక్కడికి ఐవోలీపై వచ్చిన అవుట్ సోర్స్ ఉద్యోగి బాధ్యతలు తీసుకునేందుకు కూడా భయపడుతుండడం గ్రంథాలయం దుస్థితికి నిదర్శనం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అందరికి అందుబాటులో ఉండే స్థలంలో సొంత భవనాన్ని నిర్మింపచేసి మారుతున్న కాలానుగుణంగా వసతులను కల్పించడం ద్వారా గ్రంథాలయాన్ని నిర్వహించాలంటూ పాఠకులు, ప్రజలు, నిరుద్యోగులు, పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొంత భవనాన్ని నిర్మించాలి

ప్రభుత్వం గ్రంథాలయం కోసం వెంటనే సొంతభవనాన్ని నిర్మించాలి. ఏళ్ల తరబడి ఇరుకిరుకు అద్దెఇళ్లలో లైబ్రరీని నిర్వహిస్తుండడం, తరచూ వేరేప్రాంతాలకు మారుస్తుండడం పాఠకులకు ఇబ్బందిని కలిగిస్తోంది. ఇప్పటికైనా పాలకులు గ్రంథాలయం కోసం శాశ్వత స్వంతభవనాన్ని నిర్మించాలి.

- చాన్‌బాషా, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు.

అందరికి అందుబాటులో ఉండాలి

జిల్లా కేంద్రమైన రాయచోటిలో గ్రంథాలయం పాఠకులు, ప్రజలందరికి అనువైన ప్రాంతంలో ఉండాలి. ఎక్కడా దొరకని పుస్తకాలు లైబ్రరీలో మాత్రమే దొరకుతాయి. అందరికి అందుబాటో ఉన్న స్థలంలో లైబ్రరీని నిర్వహించేలా జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు.

స్థలాన్ని కేటాయించాలి

గ్రంథాలయం నిర్మాణం కోసం ప్రభుత్వం వెంటనే సొంత స్థలాన్ని కేటాయించాలి. అందరికి అనువైన రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలో స్థలం కేటాయించాలి. సొంతభవనాన్ని తక్షణమే నిర్మించాలి. అప్పుడే పట్టణ ప్రజలకు లైబ్రరీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. నిరుద్యోగుల కల నెరువేరుతుంది.

- నాగేశ్వరరావు, మాజీ విద్యార్థి సంఘం నేత.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి-రాయచోటి

వరలక్ష్మి వ్రతం వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి, తోపు గంగమ్మ, చెక్‌పోస్ట్ వద్ద శివాలయం, సంబేపల్లెలోని శ్రీ దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు. **కలకడ:** వరలక్ష్మి వ్రతం వేడుకలను భక్తిశ్రద్ధలతో మహిళలు నిర్వహించుకున్నారు. మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయానికి అనుసంధానంగా ఉన్న నగరాల ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి మహిళలు పూజలు నిర్వహించారు. అగ్రహారం, గోపాలపురం, కదిరాయచెరువు, కోన, ఎర్రకోటపల్లి, బాలయ్యగారిపల్లి, బాటవారిపల్లి, ఎర్రయ్యగారిపల్లిలో మహిళలు భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. **వీరబల్లి:** రెండవ శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని వీరబల్లి హరిహరుల దేవాలయం, పెద్దివీడు లక్ష్మీనరసింహ దేవాలయంలో అర్చకులు ఆదిలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలతో అభిషేకం చేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటా ఘనంగా వరలక్ష్మీవ్రతం భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. **మదనపల్లెఅర్బన్:** పట్టణంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలు నిర్వహించారు. నీరుగట్టువారిపల్లెలో తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం శ్రీచౌడేశ్వరి దేవి, కోర్టులో గంగమ్మ ఆలయంలో, శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు వరలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. **మదనపల్లె :** మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో స్థానిక రెడ్డెప్పనాయుడు కాలనీలో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ విద్యాసాగర్, గురప్పనాయుడు పాల్గొన్నారు. **పీలేరు:** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీ రౌద్రాల అంకాళమ్మ ఆలయం, ప్రకాశం రోడ్డు, సదుం రోడ్డులలోని రామాలయాలు, అ గ్రహారంలోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మదనపల్లె మార్గంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, కోటపల్లెలోని ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, వేంకటాద్రి ఇండ్లలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గండి క్షేత్రంలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

గండిక్షేత్రంలో శ్రావణ మాస మూడవ శనివారం సందర్భంగా తరలివచ్చే లక్షలాది భక్తులు సౌకర్యార్థం ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా వాహనాల్లో వచ్చే భక్తులకు ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు శుక్రవారం పలు సూచనలు చేశారు. వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. దేవస్థానం వద్దకు ఎలాంటి వాహనాలు అనుమతించబోమని తెలిపారు. వేంపల్లి నుంచి గండి, రాయచోటి, కదిరి వైపుగా వెళ్లే వాహనాలు మండలంలోని వీరన్నగట్టుపల్లె క్రాస్ రోడ్డు వరకు మాత్రమే అనుమతి ఉందన్నారు. రాయచోటి-కదిరి వైపు నుండి వేంపల్లి వైపు వచ్చే వాహనాలు అద్దాలమర్రి క్రాస్ రోడ్డు వరకు మాత్రమే రావాల్సి ఉందన్నారు. వీరన్నగట్టుపల్లె క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను పార్కింగ్ చేసి, అక్కడి నుంచి వేంపల్లి ప్రయివేట్ పాఠశాలల వాహనాల్లో ఉచితంగా గండిక్షేత్రం చేరుకోవాలని సూచించారు. ఇందుకు భక్తులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

మత్తు పదార్థాలు సేవిస్తే కఠిన చర్యలు

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆయన గండిక్షేత్రంలో భక్తులకు కావలసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం తరపున బ్రీతింగ్ అనలైజర్ (మత్తు పానీయాలు, మత్తు పదార్థములు సేవించిన వారిని గుర్తింపు పరికరం) అందుబాటులో ఉంచామన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే అన్నారు. శుక్రవారం ఓబులవారిపల్లి పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనంలో హెల్మెట్లు ధరించి పోలీసులు అవగాహన ర్యాలీ చేశారు. చలంపాలెం గ్రామానికి చెందిన ఏనుగుల రవిరాజు హెల్మెట్లు పోలీస్ సిబ్బందికి వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పేర్కొన్నారు. హెల్మెట్ ధరింపుతో ప్రాణాలు సురక్షితమని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు హెల్మెట్ ప్రాధాన్యత వివరిస్తూ ఓబులవారిపల్లి పోలీసుస్టేషన్ నుండి చిన్న ఓరంపాడు బస్ స్టాండ్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతుండటం మనం చూస్తున్నామన్నారు. ఈ ఘటనల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్ నాయుడు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. హెల్మెట్ ధరించని వారిపై కఠినంగా ఎం ఎం వి యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత, మీ కుటుంబం యొక్క ఆనందం గురించి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎఎస్‌పి

అర్హులందరికీ ఉపకరణాలు

వైద్య శిబిరంలో పాల్గొన్న అధికారులు, విభిన్నప్రతిభావంతులు

ప్రజాశక్తి-పీలేరు

విభిన్న ప్రతిభావంతుల వైకల్య శాతాన్ని అనుసరించే వారికి ప్రభుత్వం ద్వారా ఉచిత ఉపకరణాలు అందజేస్తామని వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్.వి. కృష్ణకిశోర్ తెలిపారు. పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం ఉప కరణాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్ష్యం మేరకు వైఎస్ఆర్ కడప జిల్లాలో 22 శిబిరాలు నిర్వహించి 4,700 మందికి ఉపకరణాలు అందజేయడం కోసం లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. అన్నమయ్య జిల్లాలో 21 శిబిరాలకు గాను ఇప్పటివరకు 18 శిబిరాలు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన మూడు శిబిరాలను కూడా పూర్తయ్యాక లబ్ధిదారుల సంఖ్యపై నిర్దిష్ట వివరాలు తెలిపే అవకాశం ఉందని అన్నారు. శిబిరంలో పాల్గొంటున్న విభిన్న ప్రతిభావంతుల వద్ద ఉన్న సదరం ధ్రువపత్రాల్లోని వికలత్వ శాతాన్ని లెక్కలోకి తీసుకుని, ఉపకరణాలు అందజేస్తామని చెప్పారు. వీరిలో 86 శాతానికి పైగా వికలత్వం ఉన్న వారికి మాత్రమే మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు అందే అవకాశం ఉందని తెలియజేశారు. ఉచిత ఉపకరణాల కోసం ఎంపికైన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.5 వేలు మొదలుకుని రూ. 47 వేలు విలువ చేసే ఉపకరణాలు ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. ఎంపికైన వారికి రెండు నెలల తర్వాత ఉపకరణాలను కాన్పూర్‌లోని అలింకో సంస్థ సరఫరా చేస్తుందని వివరించారు. పీలేరులో జరిగిన శిబిరంలో 132 మంది ప్రత్యేక ప్రతిభావంతులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పీలేరు ఎంపిడిఒ శివశంకరయ్య, పిఎన్ఒ శివాసిన్, రిహాబిలిటేషన్ అధికారి శ్రీకాంత్, లలిత కుమారి, ధరణిజ, సిఆర్‌పి జలకనూరి మురళీధర్ రాజు, శైలజ, సచివాలయ ఉద్యోగులు, పీలేరు విభిన్న ప్రతిభావంతుల సంఘ నాయకులు రామ్మోహన్ రెడ్డి, వెంకట్రమణా రెడ్డి, చలపతి, రమణ పాల్గొన్నారు.

76 మందికి వికలత్వ పరీక్షలు

కలకడ: టూల్ ఐడెంటిఫికేషన్‌కు 76 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరైనట్లు డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాపరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో నిర్వహించిన టూల్ ఐడెంటిఫికేషన్ వెరిఫికేషన్‌కు 76 మంది వివిధ రకాలైన వికలాంగులు హాజరైనట్లు తెలిపారు. ఈ క్యాంపును హైదరాబాద్‌కు చెందిన అలిమోకో సంస్థ వారు వికలాంగులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో వారికి ఉన్న వికలాంగత్వం నిర్ధారణ అయ్యేటట్లు పరీక్షలు నిర్వహించి వారికి వారి వికలాంగత్వం బట్టి పర్సెంటేజ్‌తో ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు.ఈ క్యాంపు నందు హైదరాబాద్ కు చెందిన అలిమోకో సంస్థ డాక్టర్ రాజా వికలాంగులకు పరీక్షలు నిర్వహించిన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేవేంద్ర, నందిని, ఉమామహేశ్వరి, సుబ్రమణ్యం, జగన్నాథం రెడ్డి, మరియు జయచంద్రలు పాల్గొన్నట్లు తెలిపారు.

విభిన్నప్రతిభావంతులు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు ఇవ్వాలి

మాట్లాడుతున్న సిపిఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచుల వేతనాలు పెంచాలని, గ్రామాల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన మూడు దొంతరల అధికార వ్యవస్థలో దిగువనున్న స్థానిక సంస్థలకు నిధులు, విధులు బదలాయించడంలో ఇప్పటికీ లోపాలు తీవ్రంగా కనబడుతున్నాయని తెలిపారు. అభివృద్ధిలో స్థానిక సంస్థలైన పంచాయతీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సర్పంచులు పార్టీ యేతర ప్రాతిపదికపై ఎన్నికై నాలుగు సంవత్సరాలు గడిచిపోతోందని, ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచులు నిధులు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ వర్గాలకు చెందిన సర్పంచులు 50 శాతానికిపైగా ఉన్నారన్నారు. వారందరూ అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తే వాటికి చెందిన బిల్లులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ దారిలోనే నడుస్తోందని విమర్శించారు. ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారి మళ్లించాలని అనుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడత నిధులు విడుదల చేసిన గత ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.1,121 కోట్లు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వాటి కోసం చాలా కాలంగా ఆందోళన చేస్తున్నా, ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను గ్రామ స్వపరిపాలన ప్రోత్సహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి 6 నెలల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల ఖాతాలకు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఐదవ ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు గత నాలుగు సంవత్సరాలుగా రావలసిన నిధులు బదిలీ చేయాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల గౌరవ వేతనం రూ.3 వేలు నుండి రూ.10 వేలు వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పంచాయతీ బిల్లులు ఎప్పటికప్పుడు విడుదలయ్యేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలకు సంక్రమించిన 29 అంశాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా బదిలీ చేయాలని కోరారు. సర్పంచులు విధి నిర్వహణలో మరణిస్తే రూ.20 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించాలని పేర్కొన్నారు. 5వ షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలలోని గ్రామాల అభివృద్ధికి గిరిజన తండాల గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో గ్రామ పంచాయతీల పర్యవేక్షణ ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలకు రావలసిన రిజిస్ట్రేషన్ సర్‌ఛార్జీలను క్రమం తప్పకుండా పంచాయతీ ఖాతాలో జమ చేయాలని కోరారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారు వేసే లేఔట్లకు ఇచ్చే పరిమిషన్లకు ఆ పరిధిలోని గ్రామ పంచా యతీల తీర్మానం కావాలని ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం కడప జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు

ఓటమి భయంతో కుట్రలు

- కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జడ్‌పిటిసి ఉప ఎన్నికలలో ఓడిపోతామని భయంతో టిడిపి కుట్రలు పన్నుతుందని, అడ్డగోలుగా పోలింగ్ కేంద్రాలను మార్పులు చేస్తున్నారని, పోలింగ్ కేంద్రాలలో సిసి కెమెరాలను అమర్చాలని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక గ్రామంలో ఉన్న ఓటర్లు మరో గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి మార్చడం వల ఓటు వేసేందుకు నాలుగైదు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందన్నారు. 2021 సంవత్సరం ప్రకారం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా, రాష్ట్ర ఎన్నికల కమీషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నల్లపురెడ్డిపల్లి, ఎర్రబల్లి, నల్లగొండు వారిపల్లి గ్రామాల ఓటర్లకు ఓటు వేసే పోలింగ్ బూత్‌లకు మధ్య దూరాన్ని పెంచి ఓటర్లను ఎన్నికలలో పాల్గొనకుండా చూడాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించే విధంగా ఎన్నికల కమిషన్ చూడాలన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికైన స్కౌట్ విద్యార్థులు

జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటిలోని పోలీస్ పరేడ్‌లో ఈ నెల 15న నిర్వహించే 79వ జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నూలివీడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కౌట్ అండ్ గైడ్ విభాగం నుండి తొమ్మిది మంది గైడ్స్ బాలికలు, ఏడుగురు స్కౌట్ బాలురు ఎంపికయ్యారని పాఠశాల స్కౌట్ మాస్టర్ కర్కోటి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎంపికైన వారిలో తొమ్మిదో తరగతి చదువుతున్న గైడ్ శ్యామల, వంశిక, హారిక, సతీ సుమతి, పూజిత, కరుణ, సన, సమ్రిన్, జ్యోతి మరియు స్కౌట్ ఎస్ఎండి. ఆసిఫ్, యాదగిరి ఆచారి, చిన్న కులాయప్ప, వినిల్ కోటేశ్వర, శ్రీరామ్, రసూల్ బాషా ఉన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే వేడుకలకు పాల్గొనే విద్యార్థులను, పాఠశాల స్కౌట్ మాస్టర్స్ కె. చంద్రశేఖర్, రమేష్ నాయక్ గైడ్ కెప్టెన్ వి.భారతీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజశేఖర్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

క్రైం కార్నర్

నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

రైతులను బెదిరించిన కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఆవులను తరలిస్తున్న రైతులను అడ్డుకుని డబ్బులివ్వకపోతే చంపుతామని బెదిరించిన ఇద్దరిని తాలూకా సిఐ కళా వెంకటరమణ, ఎస్ఐ గాయత్రి అరెస్టు చేశారు. డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం, తిరువన్నామలై జిల్లా, అరణి తాలూకా, మయూరు గ్రామానికి చెందిన రైతులు బాలాజీ, కమలకన్నన్ గురువారం అనంతపురం జిల్లా, గోరంట్లలో జరుగుతున్న పశువుల సంతకు వెళ్లి వ్యవసాయ పనుల నిమిత్తం రెండు ఎద్దులు, ఒక ఆవు, మూడు దూడలను కొనుగోలు చేసి లగేజి వాహనంలో మయూరు గ్రామానికి తీసుకెళ్తున్నారని చెప్పారు. మార్గమధ్యంలోని మదనపల్లె బైపాస్ రోడ్డు ఆర్‌టిఒ కార్యాలయం వద్ద మదనపల్లె కు చెందిన చేకూరి నాగార్జున, సురేష్ కుమార్ వాహనాన్ని అడ్డగించి రూ.10 వేలు డిమాండ్ చేశారని, డబ్బు ఇవ్వని పక్షంలో చంపుతామని బెదిరించారని తెలిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వారిని కదలనివ్వకుండా బ్లాక్ మెయిల్ చేశారన్నారు. ఆఖరకు బాధిత రైతులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డిఎస్‌పి వెల్లడించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం మృతి చెందాడు. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, బెంగుళూరు రోడ్డు- వేపమాను వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వేంపల్లికి చెందిన శంకర(40)ను ఈ నెల 3న ఐషర్ లారీ ఢీకొంది. బాధితున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స అనంతరం రుయాకు తరలించారు అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆటో డ్రైవర్‌పై కొంతమంది మోల్డింగ్ వర్కర్స్ దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు పోలీసుల కిచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని వలసపల్లి పంచాయతీ కాట్లాటపల్లిలో నివాసముంటున్న ఈశ్వర్ టాటా ఏస్ వాహనం నిర్వహించుకుంటూ జీవనం చేస్తున్నాడు. బాడుగకు వెళ్లి కదిరిరోడ్డులో ఇంటికి వెళుతుండగా ప్రశాంత్ నగర్ వద్ద మోల్డింగ్ వర్కర్స్‌తో వెళ్తున్న బోలేరో వాహనం ఢీకొంది. దీంతో ఈశ్వర్ వారిని ప్రశ్నించడంతో దాడి చేసి గాయపర్చారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకొన్న బాధితుడు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సిసి పుటేజ్ లను పరిశీలించి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మహారాజశ్రీ రాజంపేట (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జి కోర్టులో

O.S.No : 59/2024

షేక్ మస్తాన్, తండ్రి షేక్ ఖాసిం సాహెబ్, నివాసం : ఎర్రబల్లి, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

షేక్ కరిముల్లా, తండ్రి ఖాసిం సాహెబ్, ఎర్రబల్లి, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పైన తెలిపిన వాది మీ పైన Perminent injuction దావా దాఖలు చేసియున్నారు. మీకేమైనా ఆక్షేపణలున్న యెడల ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ 12.08.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//By Order of the Court//
S.M.D. HABIBULLAH,
S.M.D. THOUSEEF,
Advocates,
RAJAMPET,
Cell No:94409 41506, 79890 01522.

మహారాజశ్రీ రాజంపేట (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జి కోర్టులో

I.A.No.171/2024
O.S.No : 59/2024

షేక్ మస్తాన్, తండ్రి షేక్ ఖాసిం సాహెబ్, నివాసం : ఎర్రబల్లి, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటిషనరు

Vs

షేక్ కరిముల్లా, తండ్రి ఖాసిం సాహెబ్, ఎర్రబల్లి, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్

నోటీసు

పైన తెలిపిన పిటిషనరు మీ పైన U/039 Rule 1 and 2 C.P.C. పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీకేమైనా ఆక్షేపణలున్నయెడల మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ 12.08.2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//By Order of the Court//
S.M.D. HABIBULLAH,
S.M.D. THOUSEEF,
Advocates,
RAJAMPET,
Cell No:94409 41506, 79890 01522.